

అమ్మ భాష ఎంత మధురం

రేపు తెలుగు భాషా దినోత్సవం





● (ఉప్పలగుప్తం)

మన తెలుగు మాట మమతల మూట.
అమ్మతో మనకెంత అనుబంధమో
అమ్మభాషతోనూ అదే బంధం.
అమ్మనూ...అమ్మభాష తెలుగునూ వేర్వేరుగా చూడగలమా!!!
పసిపాపగా ఉన్నప్పుడు నుంచే
తీయని తెలుగును రంగరించి అమ్మ మనల్ని పెంచింది.
అన్నం తిననని మారాం చేస్తే కమ్మని తెలుగు పాటలతో
చందమామను చూపించి బువ్వ తినిపించింది.
అదీ అమ్మకూ తెలుగుకూ ఉన్న ఆత్మీయ బంధం.

ఎన్ని భాషలు నేర్చినా తెలుగులో మాట్లాడితేనే మనస్సుకు ఎంతో ఆనందం. ఆహ్లాదం. అదీ మన తెలుగంటే. తెలుగు పద ఉచ్చారణ ఎంత గంభీరమో అంత సుకుమారం. వెలగబెట్టింది చాలు వెళ్లి అన్నం తిను అంటూ నాన్న సుతిమెత్తని మందలింపు.. ఉద్ధరించింది చాలు ఇకనైనా బుద్ధిగా మసలుకో.. తాతయ్య అనురాగంతో కూడిన హెచ్చరిక. ఇలాంటి ప్రేమపూరిత మందలింపులూ, హెచ్చరికలూ మన తెలుగు భాషకు మాత్రమే సొంతం. పకపకలు, వికవికలు, రుసరుసలు, విసవిసలు, బుసబుసలు, కస్సుబుస్సులు, కకావికలు వంటి పదాలు తెలుగుభాష ఆస్తిపాస్తులు. తెలుగు ఉచ్చారణలో వెలువడే ధ్వని తరంగాలు వీణానాదాన్ని తలపిస్తాయి. తెలుగు మాట్లాడుతుంటే మన శరీరంలో ఉద్భవించే ప్రకంపనలు అనేక రుగ్మతలకు ఔషధంగా పనిచేస్తాయి. అందుకే తెలుగు ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతోంది. మన తెలుగుపాటకు అంతర్జాతీయ వేదికపై సింహాసనం దక్కింది. ప్రపంచంలో పలు దేశాల ప్రజలు తెలుగు నేర్చుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారని ఇటీవల నిర్వహించిన ఒక సర్వేలో తేలింది. ఉపాధి కోసం పరాయి భాషను ఆశ్రయించినా జీవిత విలువలు నేర్పే అమ్మభాషే మనకు అమృతతుల్యం. భవిష్యత్ తరాలకు తెలుగును మరింత చేరువ చేద్దాం. పిల్లలకు తెలుగు భాష గొప్పదనంపై అవగాహన కల్పిద్దాం. తెలుగు పుస్తక పఠనంపై ఆసక్తి కల్పిద్దాం.. తెలుగు భాష మాధుర్యాన్ని నలుదిశలకూ పంచుదాం. తెలుగుభాషా ఉత్సవాలు నిర్వహించడం ద్వారా మరింత మందికి కమ్మని తెలుగు చేరువయ్యేలా కృషి చేద్దాం. వివిధ ప్రాంతాల ముచ్చటైన తెలుగు యాసలను అందరికీ పరిచయం చేద్దాం. వెరసి తెలుగు భాషాభివృద్ధికి మన వంతు పాటు పడదాం. తెలుగు పండితులు, కవులు, రచయితలను సందర్భోచితంగా సత్కరించుకుందాం. అమ్మ రుణం తీర్చుకుందాం. అమ్మభాషకు అత్యున్నత స్థానం కల్పిద్దాం. ఇంకెందుకు ఆలస్యం.. రండి. కదలిరండి. తెలుగు వెలుగును విశ్వవ్యాప్తం చేసేందుకు ఈరోజే నాంది పలుకుదాం..



రైటర్ కొండల్‌రావు

కమిటీ కుర్రోళ్లు సినిమా మాటల రచయితగా వాడపాలెం కుర్రోడు

7

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి కొబ్బరి రైతుల సమస్యలు

ఈదరపల్లిలో ప్రతినిధుల సదస్సు

వార్త..7లో

అర్ధరాత్రి ఇసుక తరలింపు



సీజ్ చేసిన వాహనాలు

అంతర్వేది, ఆగస్టు 27: సఖినేటిపల్లి మండలం అంతర్వేది తీరం ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లు, ఒక జేసీబీని పోలీసులు సోమవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. రాత్రి సమయంలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతుందన్న సమాచారం రావడంతో ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ కుడుపూడి దుర్గాశ్రీనివాస్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేయగా వాహనాలను సీజ్ చేసి అసిస్టెంట్ డైరెక్టర్ మైన్స్ అండ్ జియాలజీ డిపార్ట్‌మెంట్‌కు తదుపరి చర్య నిమిత్తం అప్పగించారు.

గుర్రుగా..



నామినేటెడ్ పోస్టుల భర్తీలో ఎనలేని జాప్యం..!
అసహనానికి గురవుతున్న టీడీపీ, జనసేన, బీజేపీ కేడర్
జనసేన పార్టీలో అంతర్గత పోరు
కీలక పదవుల భర్తీకి బ్రేక్ వేస్తున్నారంటూ ఆరోపణలు
మరోవైపు పదవుల కోసం ఆశల పల్లకీలో ఆశావహులు

● (అమలాపురం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఆవిర్భవించినప్పటికీ పదవుల పందేరంలో జరుగుతున్న తాత్సారం కూటమిలోని పార్టీల కార్యకర్తల్లో అసహనానికి కారణమవుతుంది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నామినేటెడ్ పోస్టుల భర్తీ ఇప్పట్లో లేనట్టుగా కనిపిస్తుండడంతో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలకు చెందిన నేతలు తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారు. అయితే కూటమి పార్టీలకు ఏవిధంగా న్యాయం చేయాలనే దానిపై టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మల్లగుల్లాలు పడుతుండడం వల్లే నామినేటెడ్ పోస్టుల భర్తీలో జాప్యం అనివార్యమవుతుందని ఆ పార్టీ ముఖ్య నాయకులు చెబుతున్నారు. ఐదేళ్ల పాటు వైసీపీ ప్రభుత్వ పెద్దల అణచివేత ధోరణితో ఎన్నో ఇబ్బందులు, ఆర్థిక కష్టాలు, కేసుల వంటి వాటిని ఎదుర్కొన్న ద్వితీయ స్థాయి నాయకులు నామినేటెడ్ పోస్టుల కోసం ఆశలు పెట్టుకున్నారు. కానీ రోజురోజుకు వాటి భర్తీ సంగతిని పక్కన పెట్టేశారని ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి.

జనసేన నాయకుల్లో అభిప్రాయ భేదాలు

వేర్వేరుగా పుట్టినరోజు వేడుకలు

సెప్టెంబరు 2వ తేదీన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పుట్టినరోజుకు భారీగా ఏర్పాట్లు చేయాలనే తలంపుతో ఆ పార్టీకి చెందిన కొందరు సిద్ధపడుతున్నారు. మరికొందరు ఎంత కష్టపడినా జనసేనలో గుర్తింపు ఉండడం లేదనే వేదనతో గడుపుతున్నారు. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో జనసేన పార్టీ రెండు వర్గాలుగా విడిపోయి ఎవరికి వారే పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు జరుపుకునేందుకు సిద్ధమవుతున్న తీరు వారిలో ఉన్న అనైక్యతకు అద్దం పడుతోంది.

పోటాపోటీగా పవన్ పుట్టినరోజు వేడుకలు చేయాలనే లక్ష్యంతో రెండు వర్గాలు సిద్ధమవుతున్నప్పటికీ వారిని నడిపిస్తున్న తెర వెనుక శక్తులు మాత్రం నియోజకవర్గ ఇన్‌చార్జి, టీడీపీ ఇచ్చే నామినేటెడ్ పదవుల కోసం లాబీయింగ్ చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు జనసేన పార్టీ బలోపేతం కోసం భారీగా పోటీపడి మరీ సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ కేడర్ విజయవంతంగా చేసినప్పటికీ కనీసం జనసేన అధిష్ఠాన పెద్దల నుంచి అభినందన సత్కారాలు కూడా నోచుకోలేకపోయామని వేదనతో కోనసీమ జిల్లాలోని జనసేన కేడర్ ఉంది. ఇక కూటమి ఎంపిక చేసే నామినేటెడ్ పదవుల్లో తమకు ప్రాధాన్యత లభించడం కలగానే మిగిలిపోతుందని పేర్కొంటున్నారు. జనసేనకు అంకితభావంతో పని చేస్తున్న ముఖ్య నాయకులు, కేడర్‌ను గుర్తించే నాయకత్వం లేకపోవడంతో క్రమంగా ఆ పార్టీ కార్యకర్తల్లో తీవ్రమైన నిరాశ, నిస్పృహలు చోటుచేసుకుంటున్నట్టు సమాచారం.

బీజేపీలోనూ అదే తంతు

ఇక కూటమి పక్షంలో మరో పక్షమైన బీజేపీ కూడా తమ కేడర్‌కు ఖచ్చితంగా పదవుల్లో స్థానం కల్పించాలంటూ టీడీపీ అధిష్ఠానంపై ఒత్తిడి పెంచుతోంది. ప్రతీ నియోజకవర్గంలోను దేవస్థానాల ఛైర్మన్లు, ఇతర కమిటీల్లో అవకాశం కల్పించాలనేది ఆ పార్టీ నాయకత్వం డిమాండ్.. ఇదిలా ఉండగా రాష్ట్ర వ్యాప్తంగా ఎన్డీఏ కూటమి కీలకమైన పదవులను పార్టీల కోసం పనిచేసిన వ్యక్తులకు కట్టబెట్టాలనే ప్రతిపాదనలు సిద్ధం చేసినప్పటికీ వాటికి ఆమోద ముద్ర వేయడంలో చంద్రబాబు ఆలోచనలో పడ్డారని సమాచారం. ముఖ్యంగా టీటీడీ ఛైర్మన్, ఏపీఐసీసీ కార్పొరేషన్ వంటి కీలకమైన ఛైర్మన్ పోస్టులతో పాటు వాటి డైరెక్టర్ల పదవుల కోసం టీడీపీ, జనసేన, బీజేపీ పక్షాలు తీవ్రంగా పోటీ పడుతుండడంతో ప్రస్తుతానికి ఆ నామినేటెడ్ పోస్టుల భర్తీకి ముఖ్యమంత్రి చంద్రబాబు బ్రేక్ వేసినట్టు సమాచారం. దాంతో జనసేన, టీడీపీ, బీజేపీ పక్షాలకు చెందిన కోనసీమ జిల్లాలోని నాయకత్వాలు తీవ్రమైన అసంతృప్తికి లోనవుతున్నాయి.

'రైల్వేలైన్' అడ్డంకులను గుర్తించాలి

అధికారులతో కలెక్టర్ మహేష్‌కుమార్ సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ ప్రాజెక్టు అలైన్‌మెంట్ ఉన్న గ్రామాల్లో ప్రత్యేక బృందాలను నియమించి ప్రాజెక్టు నిర్మాణానికి ఎదురవుతున్న సమస్యలను గుర్తించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రైల్వేలైన్ ప్రాజెక్టులో భాగంగా గౌతమీ, వైనతేయ, వశిష్ట నదులపై వంతెనల నిర్మాణాల పనులు ముందుకు వెళ్లాలని రైల్వే అధికారులకు సూచించారు. కోటిపల్లి-మాగాం వరకు రైల్వేలైన్ అలైన్‌మెంట్‌లో ఉన్న భూమిని డిసెంబరు నాటికి రైల్వేశాఖకు అప్పగిస్తామని, రైల్వే అధికారులు టెండరు పనులు ప్రారంభించాలన్నారు. అమలాపురం నుంచి రాజోలు వరకు ప్రస్తుత రైల్వేలైన్ అలైన్‌మెంట్ ఉన్న గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, సర్వేయర్, వ్యవసాయ సహాయకులతో ప్రత్యేక బృందాలను నియమించి ప్రాజెక్టు నిర్మాణానికి ఎదురవుతున్న సమస్యలను గుర్తించి 14 రోజుల్లో నివేదిక సమర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గౌతమీ నదిపై నిర్మిస్తున్న వంతెన అయినవిల్లి మండలంలో ల్యాండింగ్ పాయింట్ వద్ద భూమి విషయంలో ఎదురవుతున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, సౌత్ సెంట్రల్ రైల్వే డిప్యూటీ సీఈవో పీవీ సత్యనారాయణ, ఆర్డీవోలు జి.కేశవవర్ధనరెడ్డి, వి.సత్యనారాయణ, ఓఎన్జీసీ, గెయిల్ ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో విప్లవాత్మక మార్పులు..

డ్రోన్ సాంకేతికత ద్వారా వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావచ్చని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో డ్రోన్ సాంకేతికత మీద జిల్లాలోని గ్రామ సర్వేయర్లకు మంగళవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. పంట పొలాల్లో కలుపు మందుల పిచికారీ, ఎరువులు, విత్తనాలు వెదజల్లడం వంటివి డ్రోన్లతో సులభతరమన్నారు. జిల్లాలోని ఇసుక ర్యాంపులను డ్రోన్లతో పరిరక్షించే దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ప్రధాన డ్రెయిన్లు, పంటకాల్వల్లో గుర్రపుడెక్క, తూడును తొలగించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

వానపల్లి గ్రామసభ అర్జీలను పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ నిషాంతి



అమలాపురం టౌన్, ఆగస్టు 27: వానపల్లి గ్రామసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు అందుకున్న ఫిర్యాదులను పూర్తిస్థాయిలో పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ముఖ్యమంత్రి అందుకున్న ఫిర్యాదులను పరిష్కరించే అంశంపై జిల్లాస్థాయి అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామసభలో వివిధ సమస్యలపై ముఖ్యమంత్రికి 391 ఫిర్యాదులు అందాయన్నారు. వీటన్నింటినీ ఎస్‌ఎల్‌ఏ పీరియడ్ లోపు పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదులను పరిష్కరించలేని పక్షంలో అందుకుగల ఖచ్చితమైన కారణాలను వివరిస్తూ సంబంధిత అధికారులు స్పీకింగ్ ఆర్డరును హెచ్‌సీఎం ప్రజావేదిక గ్రీవెన్స్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతీ సమస్యపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలన్నారు. ఫిర్యాదుల్లో ఆర్థికపరమైన అంశాలు ఉంటే సంబంధిత శాఖల కార్యదర్శులకు సమస్యలు వివరిస్తూ డెమీ అఫీషియల్ లెటర్స్‌ను కలెక్టర్‌కు పంపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సీఎం చంద్రబాబు అందుకున్న ఫిర్యాదుల్లో ఇప్పటి వరకు 49 ఫిర్యాదులను పరిష్కరించినట్లు చెప్పారు. ప్రధానంగా రెవెన్యూ, వ్యవసాయం, హౌసింగ్, పశుసంవర్ధకశాఖ, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్, సివిల్ సప్లయిస్, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖలకు సంబంధించి ఎక్కువ ఫిర్యాదులు అందాయని జేసీ వివరిస్తూ వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో కొత్తపేట ఆర్డీవో సత్యనారాయణ, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మదన్ మోహన్, జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు, పంచాయతీరాజ్ ఈఈ కె.చంటిబాబు, ఐసీడీఎస్ పీడీ ఝాన్సీరాణి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర తదితరులు పాల్గొన్నారు.

"రాజమహేంద్రవరం, కాకినాడ కార్పొరేషన్లు అభివృద్ధి చెందిన స్థాయిలో అమలాపురం అభివృద్ధి చెందలేదు. ఇప్పటికీ పల్లె వాతావరణంలోనే పట్టణం ఉంది. భవిష్యత్తులో అమలాపురం కార్పొరేషన్‌గా అభివృద్ధి కావాలంటే మాస్టర్ ప్లాన్ అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పురపాలక సంఘం నుంచి ప్లాన్ అప్రూవల్ పొందాలంటే మాస్టర్ ప్లాన్ నిబంధనలు వర్తింపజేస్తారు. అప్పుడు ఒక క్రమపద్ధతిలో నగరాభివృద్ధి దిశగా పరుగులు తీస్తుంది..

-మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు



చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి

మాస్టర్ ప్లాన్ ఆవశ్యకతను వివరిస్తున్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు



మాస్టర్ ప్లానింగ్ అవసరం

భవిష్యత్తు పట్టణ ప్రజల కోసమే మాస్టర్ ప్లాన్
ఏడు బ్రిడ్జిల నిర్మాణం : ఎమ్మెల్యే ఆనందరావు
మాస్టర్ ప్లాన్‌తో భూములన్నీ హోల్డ్‌లోకి
సొమ్ములు చేతులు మారే ప్రమాదం: కౌన్సిలర్లు
మున్సిపల్ కౌన్సిల్‌లో వాడివేడి చర్చ


అమలాపురం టౌన్, ఆగస్టు 27: భవిష్యత్తు పట్టణ ప్రజల కోసమే మాస్టర్ ప్లాన్‌ను రూపొందించినట్లు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చెప్పారు. పట్టణంలోని మెయిన్ రోడ్లతో పాటు ఇంటర్నల్ రోడ్లను కూడా వెడల్పు చేసి అభివృద్ధి చేయడమే మాస్టర్ ప్లాన్ ముఖ్య ఉద్దేశమన్నారు. మాస్టర్ ప్లాన్‌ను అమలులోకి తీసుకువచ్చేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ సహకరించాలని కోరారు. 14 ఇంటర్నల్ రోడ్లు, 40 అడుగులు చొప్పున వెడల్పు చేస్తే రెండింటిని 60 అడుగులతో వెడల్పు చేసే అంశంపై అధికార పక్ష వైసీపీ కౌన్సిలర్లు కొల్లాటి దుర్గాబాయి, నాగారపు వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. పేదల భూములు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మాస్టర్ ప్లాన్ ఆమోదం పొందితే పట్టణంలోని భూములన్నీ హోల్డ్‌లోకి వెళ్లిపోతాయని, దీనివల్ల తీవ్ర ఇబ్బందులు తప్పవని కౌన్సిలర్ సంసాని బులినాని పేర్కొన్నారు. దీనివల్ల సొమ్ములు చేతులు మారే ప్రమాదం ఉందని టీడీపీ కౌన్సిలర్ అబ్బిరెడ్డి చంటి పేర్కొన్నారు. ప్రస్తుతం మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్ స్టేజిలో ఉందని, అయినప్పటికీ ఆమోదం పొందిన తర్వాత కూడా మాస్టర్ ప్లాన్ నిబంధనలు అతిక్రమించి టౌన్ ప్లానింగ్ అధికారులు పాత డేట్లతో ప్లాన్ అప్రూవల్ చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు. పూర్తి స్థాయిలో తర్జనభర్జన అనంతరం మాస్టర్ ప్లాన్‌ను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షతన జరిగింది. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రధాన ప్రాంతాల్లో ఏడు వంతెనల నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. వచ్చే వేసవిలో మూడు వంతెనలను పూర్తి చేస్తామని, ఆ తరువాత సంవత్సరం మరో నాలుగు వంతెనల నిర్మాణం పూర్తి చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. పట్టణంలో ప్రధానంగా ఉన్న వక్ఫ్ భూముల సమస్యలను పరిష్కరించడంతో పాటు ఇండస్ట్రియల్, కమర్షియల్ ఏరియాల గుర్తింపుపై తదుపరి సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.



సభలో వాడివేడి చర్చ జరుగుతున్న దృశ్యం

సభ్యుల ప్రశ్నల వర్షం

ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడుతూ కమిషనర్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో చార్జి తీసుకోవాల్సిన మున్సిపల్ డీఈ, ఆర్వోలు సమావేశం రోజునే సెలవు పెట్టడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర మాట్లాడుతూ కాంట్రాక్టు కమిటీ వేయడానికి మూడు రోజులు ముందుగా రూ.14 లక్షలతో కౌన్సిలర్లకు సమాచారం లేకుండా 16 వర్కులను ఎలా ఆమోదించారని చైర్‌పర్సన్‌ను ప్రశ్నించారు. మీకు తెలిసే ఆ పనులను చేపట్టారా అని పలువురు కౌన్సిలర్లు ప్రశ్నించగా తనకు తెలియదని సమాధానం ఇచ్చారు. ఇంజనీరింగ్ విభాగంలో ఎన్నో అవకతవకలు జరుగుతున్నాయని నాగేంద్ర తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రూ.5 లక్షలతో చేసే పనికి రూ.1.50 లక్షల లెస్‌తో టెండరును ఎలా ఆమోదించమంటారని సభ్యులు ప్రశ్నించారు. వేసవి సీజన్‌లో చేయాల్సిన డ్రెయిన్లలో సిల్టు తొలగింపు పనులను ఇప్పుడు చేపట్టడం ఏమిటని కౌన్సిలర్లు యేడిద శ్రీను, పిండి అమరావతి, బండారు గోవిందు, పడాల శ్రీదేవి ప్రశ్నించారు. రూ.39.74 లక్షలు మంజూరు చేయడంతో అత్యవసరంగా పనులు చేపట్టేందుకు కమిషనర్ ఎజెండాను రూపొందించినట్టు అధికారులు వివరించారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన కౌన్సిలర్లు 2, 3, 4, 5 ఎజెండా అంశాలను రద్దుచేస్తూ తీర్మానించారు. బ్లీచింగ్, లైమ్ వంటి వాటిని కొనుగోలు చేసేందుకు అనుసరిస్తున్న విధానాలపై సభ్యులు మండిపడ్డారు. గత సమావేశంలోనే ఫాగింగ్ మిషన్, ట్రాక్టరు కొనుగోలు చేసేందుకు ఆమోదం తెలిపినప్పటికీ ఇంత వరకు ఎందుకు కొనుగోలు చేయలేదని అధికార, విపక్ష కౌన్సిలర్లు మండిపడ్డారు. నెలకు రూ.68 వేలు చొప్పున జనరేటర్‌కు ఎలా ఖర్చు చేస్తారని, సగానికంటే తక్కువగా జనరేటర్ వేసేందుకు ఎందరో ఉండగా ఎందుకు నిర్ణయం తీసుకోలేకపోతున్నారని అధికారులను ప్రశ్నించారు. సంబంధిత కాంట్రాక్టరుకు నోటీసులు ఇచ్చి బ్లాక్ లిస్టులో పెట్టాలని కౌన్సిలర్ సంసాని బులినాని సూచించారు.



మన ఆశయం పెద్దగా ఉండాలంటే ఆలోచనలు గొప్పగా ఉండాలి... అటువంటి ఆలోచనల నుంచి పుట్టిందే నా కవిత్వం.... అయితే దానికి ఆదర్శం ఈ సమాజం. సమాజం అంటే సహజ గుణంగా భావించే నేను అందులోని జనులతో సహా పలు జీవరాశులను పరిగణలోకి తీసుకుని పరిశీలించి నా కంటూ ఒక నడవడిక ఏర్పరచుకున్నాను. ఆ నడవడికే 27 ఏళ్లకే ఆరు పుస్తకాలు రాసేలా చేసింది.... 'కమిటీ కుర్రోళ్ళు' సినిమాకు మాటల రచయితగా అవకాశం దక్కేలా చేసింది.

...కొండల్‌రావు



డైలాగ్ రైటర్

వాడపాలెం కుర్రోడే

కొత్తపేట, ఆగస్టు 27: మెగా ప్రిన్సెస్ నిహారిక కొణిదల నిర్మాతగా ఈ నెల 9న విడుదలై బ్లాక్ బాస్టర్ హిట్ అయిన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం డైలాగ్ రైటర్ కోనసీమ కుర్రోడే. అతడే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వాడపాలెం మునసబు గారి వీధికి చెందిన అడ్డగళ్ళ ఆంజనేయులు మనుమడు కొండల్‌రావు. హిస్టరీలో పీజీ చేసిన ఇతడు రచనల పట్ల ఆసక్తితో ఇప్పటి వరకు ఆరు కథలు రచించాడు. 'కమిటీ కుర్రోళ్లు' సినిమా డైరెక్టర్ వంశీ... కొండలరావును సంప్రదించగా కథకు ఊపిరిపోస్తూ మాటలు అందించాడు. ఈ సినిమా బ్లాక్ బాస్టర్ కావడంతో కొండల్ రావుకు అవకాశాలు రావడం మొదలు పెట్టాయి. మెగాస్టార్ చిరంజీవి, నాగబాబు, తనికెళ్ల భరణి, యండమూరి వీరేంద్రనాథ్, చంద్రబోస్ వంటి వారు కొండల్‌రావును పిలిచి అభినందించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కూడా అతడిని దుశ్శాలువాతో సత్కరించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని దీవించారు. ఈ సందర్భంగా కొండల్‌రావు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ మంచి కథలతో చలనచిత్ర రంగంలో గుర్తింపు తెచ్చుకోవాలన్నదే తన అభిలాష అని చెప్పాడు.



కొండల్ రావ్ రచనలు



మెగాస్టార్ చిరంజీవితో...



← రచయిత విజయేంద్రప్రసాద్‌తో...



ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నుంచి సత్కారం అందుకుంటున్న కొండల్ రావు (ఫైల్)

30న రత్నగిరిపై ఉచిత సామూహిక

వరలక్ష్మీ వ్రతాలు

అన్నవరం, ఆగస్టు 27: శ్రావణ మాస ఆఖరు శుక్రవారం సందర్భంగా రత్నగిరిపై ఈ నెల 30న ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల మహిళలు ఆరోజు ఉదయం 8 గంటలకు కొండపైకి చేరుకోవాలన్నారు. కొబ్బరికాయ, అరటిపళ్లు, పువ్వులను భక్తులు తీసుకొస్తే మిగిలిన ద్రవ్యాలు, వరలక్ష్మి రూపు, జాకెట్టుముక్క, గాజులు, ప్రసాదం దేవస్థానం అందజేస్తుందని పీఆర్వో కృష్ణారావు చెప్పారు.

1న అన్నవరంలో బాల్ బ్యాడ్మింటన్

జిల్లా జట్ల ఎంపిక

అన్నవరం, ఆగస్టు 27: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోషియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న జిల్లాస్థాయి సబ్ జూనియర్స్ బాల, బాలికల జట్ల ఎంపికలను అన్నవరంలో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు ముప్పన వీర్రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నవరం లోని సత్యదేవ జూనియర్ కళాశాల మైదానంలో జరిగే ఎంపిక లకు 2009 జనవరి 2 తర్వాత పుట్టినవారు అర్హులు. ఆసక్తి గల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, డ్రెస్‌కోడ్‌తో రావాలని కోరారు. మరిన్ని వివరాలకు 99499 59951, 80082 66003 నంబర్లలో సంప్రదించాలి.

ఎన్‌సీసీ కమాండింగ్

అధికారిగా ప్రవీణ్‌బాబు



జేఎన్టీయూకే, ఆగస్టు 27: ఎన్‌సీసీ కాకినాడ యూనిట్ కమాండింగ్ అధికారిగా పి.ప్రవీణ్ బాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన 2000 జనవరి 1న ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో నియమితులయ్యారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌బాబు మాట్లాడుతూ యువత ఎన్‌సీసీలో చేరేందుకు ఆసక్తి చూపాలని, కాకినాడ యువ క్యాడెట్‌ల్లో క్రమశిక్షణ, నాయకత్వం, దేశభక్తిని పెంపొందించడంలో కృషి చేస్తానన్నారు. అనంతరం వింగ్ కమాండర్ డీఎస్ఎన్ మూర్తి 9ఎయిర్ కమాండింగ్ అధికారి బాధ్యతలు అప్పగిస్తూ 9ఎయిర్ ఎన్‌సీసీతో తన అనుభవాన్ని తెలిపారు.

లోకో పైలట్‌కు 'జీఎం మ్యాన్ ఆఫ్ ది మంత్'

సేఫ్టీ అవార్డు



రాజమహేంద్రవరం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్లో ఆపరేటింగ్ డిపార్ట్‌మెంట్‌లో గూడ్స్ లోకో పైలెట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కె.శంకర్రావు మంగళవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ నుంచి 'జీఎం మ్యాన్ ఆఫ్ ది మంత్' సేఫ్టీ అవార్డు అందుకున్నారు. తెలప్రోలు-పెద అవుటపల్లి సెక్షన్‌లో డ్యూటీలో ఉన్న శంకర్రావు రైలు వెళ్తుండగా 457/11-9 వద్ద పెద్ద కుదుపు రావడం గమనించి వెంటనే ట్రాక్ తనిఖీ చేశారు. పట్టాల మధ్య వెల్డింగ్ వదిలేసినట్లు గుర్తించి సంబంధిత అధికారులకు తెలియజేశారు. ప్రమాదం తప్పడంతో ఆయన్ను అవార్డుకు ఎంపిక చేశారు. శంకర్రావును డీఆర్ఎం నరేంద్ర ఎ.పాటిల్, డివిజనల్, స్థానిక అధికారులు అభినందించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి...

కొబ్బరి రైతుల సమస్యలు

- భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మోహినీ మోహన్ మిశ్రా
- ఈదరపల్లిలో పలు రాష్ట్రాల ప్రతినిధులతో సమావేశం
- 2026ను కొబ్బరి సంవత్సరంగా ప్రకటించాలని డిమాండ్

అమలాపురం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామని భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మోహినీ మోహన్‌మిశ్రా పేర్కొన్నారు. గతంలో మాదిరిగా కొబ్బరిని లాభసాటి పంటగా మార్చే దిశగా రైతుల్లో తీసుకురావాల్సిన మార్పులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ ఈదరపల్లిలోని జనహిత కార్యాలయంలో మంగళవారం ఒడిసా, కేరళ, తమిళనాడు, కర్ణాటక, గోవా, బెంగాల్ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. తొలుత భరతమాత, బలరామకృష్ణుడు చిత్రపటాలకు పూజ చేశారు. జాతీయ కన్వీనర్ సుందర్‌రాజన్ జ్యోతి ప్రకాశనం చేయగా బీకేఎస్ పతాకాన్ని మిశ్రా ఆవిష్కరించారు. భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు పరిమి వెంకటరాఘవులు అధ్యక్షతన సదస్సును ప్రారంభించారు. పలు రాష్ట్రాలకు చెందిన ప్రతినిధుల సూచనలను పరిగణలోకి తీసుకుని వాటిని తీర్మానాలుగా రూపొందించారు. అఖిల భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు జలగం కుమారస్వామి, కోనసీమ జిల్లా శాఖ అధ్యక్షుడు యాళ్ల వెంకటానందం, అడ్డాల గోపాలకృష్ణ, జిన్నూరి బాబి, గోదశి నాగేశ్వరరావు, కొవ్వూరి త్రినాథరెడ్డి అనేక అంశాలను వివరించారు. కొబ్బరి ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు, మార్కెటింగ్ సౌకర్యాలను పెంపొందించేందుకు 2026ను కొబ్బరి సంవత్సరంగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. తీర్మానాలను తిక్కిరెడ్డి గోపాలకృష్ణ చదివి వినిపంచారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, ప్రధాన కార్యదర్శి మోకా వెంకటసుబ్బారావు, ఆర్వీ నాయుడు, మాకిరెడ్డి సత్తిబాబు, అప్పారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మోహన్ మిశ్రా

నేడు అమలాపురంలో జాతీయ కొబ్బరి రైతుల సదస్సు

భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో బుధవారం అఖిల భారత కొబ్బరి రైతుల సదస్సు నిర్వహిస్తున్నట్టు జిల్లా శాఖ అధ్యక్షుడు యాళ్ల వెంకటానందం తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, బీకేఎస్ జాతీయ స్థాయి నాయకులు పాల్గొంటారు.

తీర్మానాలివీ...

- రైతులకు మేలు చేసేలా కొబ్బరి బోడకాయ కిలో ధరరూ.45గా నిర్ణయించి ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా కొనుగోలు చేయాలి.
- కొబ్బరి దింపు సమస్య తీవ్రంగా ఉన్నందున ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీని ఉపయోగించి హార్వెస్టింగ్ చేసే యంత్రాలు తయారుచేసే దిశగా ప్రభుత్వం ముందడుగు వేయాలి.
- మహిళా సంఘాలకు కొబ్బరి ఉప ఉత్పత్తులపై తర్ఫీదు ఇచ్చి మార్కెటింగ్ కల్పించేలా రాయితీలు అందించాలి.
- కొబ్బరి వినియోగం పెంచేందుకు అభివృద్ధి బోర్డు చర్యలు తీసుకోవాలి.
- కొబ్బరిలో ఇరియోఫిడ్ నల్లి తెగులుతో పాటు పలు తెగుళ్లను సామూహికంగా అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
- కొబ్బరిలో దిగుబడులను పెంచడానికి మట్టి నమూనాలు పరీక్షించి మైక్రో న్యూట్రియంట్ ఎరువుల విధానం తక్కువ ఖర్చుతో అందించే విధంగా ఏర్పాటు చేయాలి.
- కొబ్బరినూనెలో కల్తీగా వాడే పారాఫిన్ ఆయిల్ కెర్నాయిల్‌పై నియంత్రణ ఉండడంతో పాటు అవసరమైతే కోనసీమలో కెర్నాయిల్ వినియోగాన్ని నిషేధించాలి.
- కొబ్బరి బోర్డు ద్వారా ఆర్అండ్ఆర్ స్కీమ్, రీప్లాంటేషన్‌లో రాష్ట్రంలో ఎక్కువ విస్తీర్ణంలో అమలయ్యేలా ప్రోత్సహించాలి.
- ప్యాక్ హౌస్ స్కీమును కొద్ది మార్పులతో రైతులకు కొబ్బరిని కురిడిగా తయారు చేసుకునేందుకు బాల్‌కోప్రా హౌస్ పేరుతో ఎక్కువ రాయితీపై అందించాలి.





చోరీ జరిగిన ఇంట్లో క్లూస్ టీం తనిఖీలు, సీఐల నుంచి వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ దేవకుమార్

బంగారం వ్యాపారి ఇంట్లో భారీ చోరీ

- కొవ్వూరు ఉషశ్రీ అపార్ట్‌మెంట్‌లో ఘటన
- 50 కాసుల బంగారం, రూ.2 లక్షల నగదు అపహరణ
- దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు

కొవ్వూరు, ఆగస్టు 27: తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో బంగారం వ్యాపారి ఇంట్లో భారీ చోరీ జరిగింది. యజమానులు నిద్రిస్తుండగానే ఈ ఘటన జరగడం సంచలనం కలిగించింది. పట్టణంలోని ఐసీఐసీఐ బ్యాంకు వీధిలో నివాసముంటున్న ఉషశ్రీ జ్యూయలర్స్ యజమాని కట్టా ఉషశ్రీ అపార్ట్‌మెంట్లో దొంగలు పడ్డారు. మంగళవారం తెల్లవారుజామున 3-4గంటల మధ్యలో దుండగులు వెనుక ఇంటి పైనుంచి ఉషశ్రీ ఇంట్లోకి ప్రవేశించారు. బెడ్రూమ్‌లో అందరూ నిద్రపోతుండగా వారి పక్కనే ఉన్న అల్మారా, బీరువాల్లో ఉంచిన 50 కాసుల బంగారు వస్తువులు, రూ.2 లక్షల నగదు, సెల్‌ఫోన్ అపహరించారు. వాటితో వెళ్లిపోతూ అపార్ట్‌మెంట్ కింద పార్కింగ్‌లో ఉంచిన యాక్టివా స్కూటర్‌నూ దొంగిలించుకుపోయారు. ఇంటి యజమాని నిద్ర నుంచి లేచిచూడగా అల్మారా, బీరువాలు తెరిచి ఉండడంతో దొంగతనం జరిగిందని గమనించి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ జి.దేవకుమార్, పట్టణ, రూరల్ సీఐలు పి.విశ్వం, కె.విజయబాబు, పట్టణ ఎస్ఐ కె.జగన్మోహన్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లను రప్పించి వేలిముద్రలు సేకరించారు. చుట్టు పక్కల ఉన్న సీసీ కెమెరా పుటేజీలను పరిశీలిస్తున్నారు. వాటి ఆధారంగా దర్యాప్తును ముమ్మరం చేశారు. ఉషశ్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు. దీంతో పాటు మరో రెండు ఇళ్లలో చోరీకి యత్నించి విఫలమైనట్టు ఆ ఇళ్ల యజమానులు పోలీసులకు సమాచారం అందించారు.



బీరువా తలుపులు తెరిచి వున్న దృశ్యం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

కలుషిత ఆహారం తిని

- గురుకుల పాఠశాల విద్యార్థినులు 72 మందికి అస్వస్థత
- ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స
- ఆసుపత్రి, వసతిగృహాలను సందర్శించిన కలెక్టర్ షాన్ మోహన్ ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ఏలేశ్వరం, ఆగస్టు 27: కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థినులు 72 మంది మంగళవారం అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరోచనాలు, కడుపునొప్పిలతో బాధపడుతున్న వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఆదివారం రాత్రి వసతిగృహంలో విద్యార్థినులకు మెనూలోలేని గోంగూర, వంకాయతో కూడిన కూర వడ్డించారు. కలుషిత ఆహారం వల్ల విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్టు ప్రాథమికంగా వైద్యులు గుర్తించారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ షాన్‌మోహన్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆసుపత్రితో పాటు గురుకులాన్ని సందర్శించి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అస్వస్థతకు గల కారణాలను తెలుసుకునేందుకు విచారణ జరిపిస్తామని కలెక్టర్ తెలిపారు. నీరు కలుషితం కాలేదని, ఆదివారం రాత్రి తీసుకున్న ఆహార పదార్థాల వల్లే అస్వస్థతకు గురైనట్టు ప్రాథమికంగా అంచనా వేస్తున్నామన్నారు. పరిస్థితి అదుపులోకి వచ్చే వరకు వైద్య సేవలు అందించాలని మండల వైద్యాధికారిణి శైలజను ఆదేశించారు. పర్యటనలో తహసీల్దారు ఆర్వీ వెంకటేశ్వరరావు, జిల్లా వైద్యాధికారి నరసింహ నాయక్, డీసీహెచ్ఎస్ స్వప్న, ప్రిన్సిపాల్ చంద్ర శారద, జనసేన ప్రత్తిపాడు ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, అలమండ చలమయ్య, ఎంఈవోలు బి.అబ్బాయి, వరలక్ష్మి ఆసుపత్రిలో విద్యార్థులను చూసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రాణాపాయం లేదు: ఎస్.స్వప్న, డీసీహెచ్ఎస్



గురుకుల పాఠశాల విద్యార్థినులు అస్వస్థతకు లోనైన మాట వాస్తవమే. వారికి ప్రాణాపాయం లేదు. కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశాలతో సత్వర వైద్య సేవలు అందించాము. బాలికలంతా క్షేమంగానే ఉన్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.



విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే



వసతిగృహంలో ఆయాతో మాట్లాడుతున్న కలెకర్ షాన్ మోహన్

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడు దుర్మరణం



సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ భానుప్రసాద్

ఐ.పోలవరం, ఆగస్టు 27: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం కేశనకుర్రుపాలేనికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు గాదిరాజు రాజంరాజు (65) మంగళవారం రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. మురమళ్లలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబును కలిసి బైక్‌పై ఇంటికి వెళ్తున్న సమయంలో కొత్త మురమళ్ల వద్ద వెనుక నుంచి బొలెరో వాహనం ఢీకొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. ఐ.పోలవరం ఎస్ఐ భానుప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రాజంరాజు మృతదేహాన్ని ఎమ్మెల్యే బుచ్చిబాబు చూసి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. టీడీపీలో క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న రాజంరాజు మృతితో కేశనకుర్రులో విషాదఛాయలు అలుముకున్నాయి. సర్పంచ్ బీర సత్యకుమారి, సీహెచ్ సుబ్బరాజు, మాజీ ఎంపీపీ ఇందుకూరి పద్మకేశవరామరాజు, గాదిరాజు రామకృష్ణంరాజు, జంపన వాసురాజు, ముదునూరి లింగరాజు, చిక్కం రాంబాబు, కడియం తమ్మయ్య, సలాది శేషారావు విచారం వ్యక్తం చేశారు.

విద్యుత్ తీగ తగిలి వ్యక్తి మృతి

ఏలేశ్వరం, ఆగస్టు 27: కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం తూర్పు లక్ష్మీపురంలో ఒక వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన సగరపు సత్యనారాయణ (34) మంగళవారం పొలంలో పామాయిల్ గెలలు కోసి ఇంటికి బయల్దేరాడు. మార్గమధ్యంలో చేతిలో వున్న కత్తి విద్యుత్ తీగకు తగిలి మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అన్నవరం సత్యనారాయణ స్వామి ప్రసాదానికి

ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు

ధ్రువపత్రాన్ని ఆవిష్కరించిన కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్

జేఎన్టీయూకే, ఆగస్టు 27: అన్నవరం సత్యనారాయణస్వామి ప్రసాదానికి ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపునిస్తూ జారీ చేసిన ధ్రువపత్రాన్ని మంగళవారం కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రధాన దేవాలయాలకు ఎఫ్ఎస్ఎస్ఏఐ ధ్రువపత్రాలు జారీ చేసేలా తగిన చర్యలు చేపట్టాలని జేఎన్టీయూకే ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణకు సూచించారు. కాకినాడ ఎంపీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ ఏపీలో ఎన్ఏబీఎల్, ఎఫ్ఎస్ఎస్ఏఐ ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ గుర్తింపుతో కూడిన ప్రయోగశాల జేఎన్టీయూకేలోని ఫుడ్ టెస్టింగ్ లేబొరేటరీ ఒకటేనన్నారు. ఈ ధ్రువీకరణ పత్రాన్ని దేవస్థానం ఈవోకు ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎం.రమేష్, అక్కూ అనుబంధ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మహ్మద్ హబీబ్ బాషా పాల్గొన్నారు.

బావ మరిదిపై కత్తితో బావ దాడి

తీవ్ర గాయాలు.. కాకినాడ జీజీహెచ్‌కు తరలింపు



అనపర్తి, ఆగస్టు 27: మండలంలోని రామవరంలో బావ మరిదిపై బావ కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఎస్ఐ శ్రీనునాయక్, బాధితుడి బంధువుల వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం రామవరం గ్రామానికి చెందిన తాతపూడి విజయ్‌కుమార్‌కు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన వీరమ్మతో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. బుధవారం రామవరంలో జరిగే ఒక వేడుకలో పాల్గొనేందుకు, చెల్లిని చూసేందుకు వీరమ్మ అన్నయ్య ఖండవిల్లి ఆనంద్ మంగళవారం సాయంత్రం వచ్చాడు. ఈ సందర్భంగా ఇంట్లో ఉన్న చిన్న చిన్న సమస్యలను ఆనంద్ ప్రస్తావించడంతో బావ, బావమరిది మధ్య వివాదం తలెత్తింది. కోపోద్రిక్తుడైన విజయ్‌కుమార్.. ఆనంద్‌ను కత్తితో తలపై నరకడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. వెంటనే బంధువులు అతడిని అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆనంద్ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పిఠాపురానికి ప్రథమస్థానం

పిఠాపురం, ఆగస్టు 27: లెర్నర్స్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పిఠాపురం జట్టు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచింది. తూర్పు గోదావరి జిల్లా అనపర్తి బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనపర్తిలో నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఎనిమిది జట్లు పాల్గొన్నాయి. ఇందులో పిఠాపురం, అనపర్తి, రాజమహేంద్రవరం జట్లు మొదటి నాలుగు స్థానాల్లో నిలిచాయి. విజేతగా నిలిచిన పిఠాపురం జట్టు క్రీడాకారులను బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు అభినందించారు.



ప్రథమ స్థానంలో నిలిచిన పిఠాపురం జట్టు

వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ. 1.34 లక్షలు

ఆత్రేయపురం, ఆగస్టు 27: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,34,727 లభించినట్లు ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు. అన్నప్రసాద భవన నిర్మాణానికి దాతలు తమ వంతు విరాళాలు సమర్పించారు.



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఈవో కమలకుమారి, సమగ్రశిక్షా కోఆర్డినేటర్ మధుసూదనరావు

సైన్స్‌తోనే శాస్త్రవిజ్ఞానం..పురోభివృద్ధి

● డీఈవో కమలకుమారి, సమగ్ర శిక్షా జిల్లా కోఆర్డినేటర్ మధుసూదనరావు

అమలాపురం రూరల్, ఆగస్టు 27: సైన్స్‌తోనే నాగరికత మరింత అభివృద్ధి సాధిస్తుందని జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.కమలకుమారి, సమగ్ర శిక్షా జిల్లా కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు పిలుపునిచ్చారు. వన్నెచింతలపూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం హెచ్ఎం గుబ్బల నాగసత్యనారాయణ అధ్యక్షతన జాతీయ అంతరిక్ష దినోత్సవ ముగింపు వేడుకలు నిర్వహించారు. తొలుత ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త యాళ్ల శివప్రసాద్‌తో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విశ్రాంత శాస్త్రవేత్త శివప్రసాద్ మాట్లాడుతూ అంతరిక్ష ప్రయోగాల్లో భారతదేశం ప్రపంచంలోనే ముందు వరుసలో ఉందన్నారు. జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకటసత్యసుబ్రహ్మణ్యం సమగ్ర శిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి పి.రాంబాబు, ఏపీవో ఎంఎకే భీమారావు, ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, యంగ్‌మెన్స్ స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు వాకాడ చిన్నా, గౌరవాధ్యక్షుడు నరాల కృష్ణకుమార్, సాంస్కృతిక సలహాదారు పిల్లి గోవిందరాజు మాట్లాడారు. వివిధ పోటీల విజేతలకు జిల్లా అధికారులు బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా అడబాల నరసింహారావు, వరదా శ్రీనివాస్, సుబ్బరాయశర్మ, కాళీదుర్గాభవానీ, జీఎస్సార్ లక్ష్మి, బ్రహ్మానందం, కేఆర్ఎస్ పద్మావతి వ్యవహరించారు. వక్తృత్వ పోటీల్లో గొల్లగూడెం ఆదిత్య పాఠశాల విద్యార్థిని నాగశ్రీలాస్య జిల్లా స్థాయిలో ద్వితీయస్థానాన్ని క్విజ్‌లో జాషువా, అక్బర్‌లు తృతీయస్థానం కైవసం చేసుకోగా వారిని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ ఎన్.శృతిరెడ్డి, ప్రిన్సిపాల్ కె.లక్ష్మీదేవి తదితరులు అభినందించారు.

పారిశుధ్య పనులు సక్రమంగా జరగడం లేదు

● ముమ్మిడివరం కౌన్సిల్ సమావేశంలో సభ్యుల ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్

ముమ్మిడివరం, ఆగస్టు 27: ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారు. పారిశుధ్య నిర్వహణకు లక్షలు కేటాయిస్తున్నాం. అయినా వార్డుల్లో పారిశుధ్య చర్యలు సక్రమంగా జరగడం లేదు. వార్డుల్లో కొంత భాగం ముగ్గు, బ్లీచింగ్ వంటి పనులు చేపట్టి మరో 15 రోజులకుగానీ మిగతా ప్రాంతాల్లో పారిశుధ్య పనులు నిర్వహించడంలేదని కౌన్సిల్ సమావేశంలో ఫ్లోర్‌లీడర్ ములపర్తి బాలకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. వార్డుల్లో అరకొరగా మాత్రమే పారిశుధ్య పనులు చేస్తున్నారు. ఈ పరిస్థితి ఎందుకు వస్తుందని బాలకృష్ణ నిలదీశారు. దీనిపై చైర్మన్ ప్రవీణ్‌కుమార్ స్పందించి శానిటరీ ఇన్ స్పెక్టర్ సత్యనారాయణరాజును, ఆ వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శి రాజీవ్‌లను ప్రశ్నించారు. శానిటేషన్‌కు సంబంధించి ఒక ట్రాక్టరు మాత్రమే పనిచేస్తుందని, ఆ ట్రాక్టరు డ్రైవరు కూడా ఆలస్యంగా వస్తున్నాడని, ట్రాక్టరు ట్రక్కు కూడా చిల్లులు పడి పాడైందని, ముగ్గు, బ్లీచింగ్ కూడా వృథా అవుతుందని శానిటేషన్ పనులు నిర్వహించే కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, విధులు సక్రమంగా నిర్వహించడంలేదని, యూనియన్ పేరు చెబుతూ కులాల ప్రస్తావన తీసుకు వస్తున్నారని శానిటేషన్ కార్యదర్శి రాజీవ్ పేర్కొన్నారు. దీనిపై చైర్మన్ ప్రవీణ్‌కుమార్, ఫ్లోర్ లీడర్ బాలకృష్ణలు స్పందించి పారిశుధ్య పనులకు మరో ట్రాక్టరును ఏర్పాటు చేసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయ్యవారి చెరువును కేంద్ర ప్రభుత్వ అమృత్ పథకంలో రూ.63లక్షలు నిధులు, రూ.10లక్షల నగర పంచాయతీ నిధులతో చేపట్టిన ఆధునికీకరణ పనులు ఇంకా పూర్తి కాలేదని, సగంలోనే నిలిచిపోయాయని, సంబంధిత కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలని ఫ్లోర్‌లీడర్ బాలకృష్ణ సూచించారు. దీనిపై ఇన్‌చార్జి కమిషనర్ సత్యనారాయణ స్పందించి కాంట్రాక్టరును పిలిపించి ఆ పనులు పూర్తిచేసే విషయంపై మాట్లాడతామన్నారు. ముమ్మిడివరం మార్కెట్‌లో కబేళాలో వెటనరీ అసిస్టెంట్ ధ్రువీకరణపత్రం లేకుండా, వాటిపై ముద్ర లేకుండా మృతిచెందిన మేకల మాంసాలను మార్కెట్‌లో విక్రయిస్తున్నారని, తూకాల్లో కూడా తేడాగా ఉంటుందని, చేపల నుంచి వచ్చే వ్యర్థాలను డ్రైనేజీలో పడవేస్తున్నారని టీడీపీ కౌన్సిలర్ అడబాల సతీష్‌కుమార్ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సోమవారం నిర్వహించే వారపుసంతలో దుకాణాలు రోడ్డుపై ఏర్పాటు చేయడం వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని, దుకాణాలు పెట్టుకునేందుకు నిర్మించిన షెడ్లుల్లో వారు వ్యాపారాలు సాగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కబేళా నిర్వహణ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని వెటనరీ అసిస్టెంట్ వివరణ ఇచ్చారు. కౌన్సిల్ సమావేశంలో లేవనెత్తిన సమస్యలు పరిష్కరించిన దాఖలాలు లేవని, కనీసం తరువాత జరిగే సమావేశంలోనైనా ముందు సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఏ మేరకు చర్యలు తీసుకున్నారో అన్న వివరణ కూడా ఇవ్వడం లేదని, అటువంటప్పుడు కౌన్సిల్ సమావేశం నిర్వహించి ప్రయోజనం ఏమిటని, తాము సమావేశాలకు రావడంవల్ల ఉపయోగం ఏమిటో తమకే తెలియడం లేదని కౌన్సిలర్ బొంతు సత్యశ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో 1వ పద్దు కింద రూ.24,46,546 జమలుగాను, రూ.3,12,972 ఖర్చుగాను, రెండో పద్దు కింద రూ.10,42,875 జమలుగాను రూ.20,68,150 ఖర్చుగాను చూపెడుతూ ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో వైస్‌చైర్మన్ వేటుకూరి బోసురాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'డిగ్రీ కళాశాలను అమలాపురం తరలించాలి'



ఎమ్మెల్సీ ఐవీ

అమలాపురంటౌన్, ఆగస్టు 27: ఆలమూరులో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలను జిల్లా కేంద్రమైన అమలాపురానికి తరలించాలని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో పాటు ఆయాశాఖల అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అమలాపురంలో పేరొందిన ఎస్‌కేబీఆర్ ఎయిడెడ్ కళాశాల కాస్తా అన్‌ఎయిడెడ్‌గా మారిపోయిందన్నారు. దీంతో పేద విద్యార్థులు అధిక ఫీజులు చెల్లించలేక కళాశాల విద్యకు దూరం అవుతున్నారన్నారు. అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని దశాబ్దాల కాలంగా విద్యార్థులు, పూర్వ విద్యార్థులు ఆందోళనలు చేస్తూనే ఉన్నారన్నారు. ఆలమూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ, బీఎస్సీ, బీకాంలో చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోయిందన్నారు. గత ఏడాది కేవలం 21 అడ్మిషన్లు మాత్రమే ఉన్నాయన్నారు. ఈ ఏడాది అది కూడా లేకుండా పోయిందని, 2014లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసినప్పటికీ భాషా అధ్యాపకులు, బోటనీ, జువాలజీ అధ్యాపకులను నియమించలేదన్నారు. కంప్యూటర్ సైన్స్, ఫిజికల్ డైరెక్టర్, కంప్యూటర్ అప్లికేషన్, లైబ్రేరియన్, నాన్‌టీచింగ్ పోస్టులను మంజూరు చేయలేదన్నారు. ఆలమూరు ప్రాంతానికి సంబంధించి రావులపాలెం, రామచంద్రపురం, మండపేటల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు అందుబాటులో ఉన్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలన్నారు. జిల్లా కేంద్రమైన అమలాపురానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను తరలించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

బీవీసీలో ముగిసిన ప్రోగ్రామింగ్ వర్క్‌షాపు

అల్లవరం, ఆగస్టు 27: ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కంప్యూటర్స్ కృత్రిమ మేధా అండ్ డేటా సైన్స్ విభాగంలో వారం రోజుల పాటు ప్రోగ్రామింగ్ నైపుణ్యాలపై జరిగిన వర్క్‌షాపు ముగిసింది. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నైపుణ్య శక్తిని పెంచుతాయన్నారు. విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కళాశాల సెక్రటరీ బోనం కనకయ్య, చైర్మన్ బోనం కృష్ణసతీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్‌ఏ చంద్రమౌళి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.ప్రవీణ్, డాక్టర్ మీరాషరీఫ్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

సేఫ్ డ్రైవ్.. సేఫ్ లైఫ్.. సేఫ్ ట్రీ



అమలాపురం టౌన్, ఆగస్టు 27: పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రియాంకాదాస్ వేల్గా సేఫ్ డ్రైవ్.. సేఫ్ లైఫ్.. సేఫ్ ట్రీ.. అంటూ దేశ వ్యాప్త యాత్రను రెండోసారి చేపట్టాడు. పశ్చిమ బెంగాల్ నుంచి ప్రారంభమైన సైకిల్ ప్రయాణం మంగళవారం అమలాపురం చేరుకుంది. ఇక్కడి నుంచి నర్సాపురం, తమిళనాడు, కేరళ మీదుగా యాత్ర కొనసాగుతుందన్నారు. గతంలో దేశంలోని 27 రాష్ట్రాల మీదుగా 19వేల కిలోమీటర్ల మేర సేఫ్ డ్రైవ్.. సేఫ్ లైఫ్.. సేఫ్ ట్రీ సైకిల్ యాత్ర చేసినట్టు తెలిపాడు.

'బైపాస్ రోడ్డు కింద మురుగు తూరలు ఏర్పాటుచేయాలి'



మామిడికుదురులో బైపాస్ రోడ్డు వద్ద నిరసన తెలియచేస్తున్న రైతులు

మామిడికుదురు, ఆగస్టు 27: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఏర్పాటు చేస్తున్న బైపాస్ రోడ్డు కింద మురుగు తూరలు ఏర్పాటు చేయాలని స్థానిక నాయకులు, రైతులు మంగళవారం మామిడికుదురులోని బైపాస్ రోడ్డు వద్ద నిరసన తెలిపారు. సరైన ప్రాంతంలో మురుగు తూరలు ఏర్పాటు చేయకపోవడంవల్ల ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరిచేలు నీట మునిగాయని రైతులు ఆరోపించారు. జాతీయరహదారిపై సరైన అవగాహన లేకుండా ఇష్టారాజ్యంగా అవసరమైనచోట కాకుండా అక్కడక్కడా తూరలు పెట్టి చేతులు దులుపుకున్నారని, దీనివల్ల పల్లపు చేలల్లోని మురుగునీరు బయటకు పోవడంలేని రైతులు పేర్కొన్నారు. మామిడికుదురు నుంచి నగరం వరకు ఆరు మురుగు బోదెలు ఉన్నాయని, ఆయా చోట్ల తూరలు ఏర్పాటు చేయాలంటూ డిమాండ్ చేశారు. వర్షం వస్తే మురుగునీరంతా దిగేలా అనువైనచోట్ల మురుగుతూరలు ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామంలోని మురుగునీరు దిగేందుకు అనువుగా రోడ్డులో తూరలు ఏర్పాటుచేయాలని స్థానిక సర్పంచ్ గౌస్ మొహిద్దీన్ (బాబు) కోరారు. దీనిపై గతంలో ఎమ్మెల్యే ద్వారా ఎన్‌హెచ్ అధికారులకు విజ్ఞాపన పత్రం అందించినప్పటికీ తూరలు పెట్టలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అవసరమైన మురుగుతూరలు ఏర్పాటుచేసి భవిష్యత్తులో డ్రెయిన్ సమస్య లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఈలి శ్రీనివాస్, రుద్ర శ్రీను, నయినాల సత్యంమూర్తి, సాపే ఏకాదశి, అప్పారి వెంకటేశ్వరరావు, యింటి మహేంద్ర, అప్పన రామకృష్ణ, పెచ్చెట్టి విజయభాస్కరరావు, పెచ్చెట్టి నాగబాబు, కంచి విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యనారాయణ

కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటాలు

అమలాపురంటౌన్, ఆగస్టు 27: దేశ వ్యాప్తంగా వ్యవసాయ కార్మికులు, పేదలు, దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం వ్యవసాయ కార్మికసంఘం పోరాటాలు సాగిస్తుందని, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.సత్యనారాయణ పేర్కొన్నారు. అమలాపురం ఎంప్లాయీస్ హోంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లాశాఖ సమావేశం కారెం వెంకటేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. సంఘం విశిష్టత, ఉపాధిహామీ ఆవశ్యకత అనే అంశంపై సత్యనారాయణ ముఖ్యవక్తగా హాజరై మాట్లాడారు. ఉపాధిహామీ పథకంలో వ్యవసాయ కార్మిక కుటుంబాల్లో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. ఇటీవల కూలీలకు ఉపాధి హామీ పథకాన్ని దూరం చేసే దురాలోచనతో ప్రభుత్వాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి ప్రయత్నాలను అవసరమైతే పోరాటాల ద్వారా అడ్డుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు తాడి శ్రీరామమూర్తి, పోలమూరి శ్రీనివాసరావు, ఇసుకపట్ల మంగాదేవి, బీర వెంకట్రావు, పెట్టా ఆనందరావు, రాయుడు వీరన్న, రాజేశ్వరి, అనంతలక్ష్మి, లక్ష్మి పాల్గొన్నారు.

'కొబ్బరిబోర్డు ఏర్పాటు చేయాలి'

అమలాపురం టౌన్, ఆగస్టు 27: కొబ్బరి కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలోని కొబ్బరి దింపు, ఒలుపు కార్మికులకు ఒలుపు కార్మికులకు ప్రత్యేక కొబ్బరి బోర్డును ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డపల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుకు వినతిపత్రం అందజేశారు. 50 ఏళ్లు నిండిన కార్మికులకు పెన్షన్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కేరళ తరహాలోని కొబ్బరి బోర్డును ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పవన్ జన్మదినోత్సవాన్ని వినూత్నంగా నిర్వహించాలి'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్

మలికిపురం, ఆగస్టు 27: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా రాజోలులో రూ.60లక్షలతో ఏర్పాటుచేసిన డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించనున్నట్టు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. అన్న క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. మంగళవారం విశ్వేశ్వరాయపురంలో ఆయన ఇంటి వద్ద జరిగిన ఎన్డీఏ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా రూపొందించడానికి మీరంతా నడుం బిగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులతో పాటు గ్రామాల్లోని రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శుల భాగస్వామ్యంతో గ్రామాలను పరిశుభ్రం చేయించాలన్నారు. గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాలను, వ్యర్థాలను ఒక ఉద్యమంలా తొలగించుదామని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో మూడు ప్రాంతాల్లో డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయడానికి తహసీల్దార్లతో కలిసి ఆదేరోజున గుర్తిద్దాం అన్నారు. రాజోలు నియోజకవర్గంలోని నదీకోతకు గురవుతున్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక బుక్‌లెట్‌ను తయారు చేయించానని, నదీకోత, ఏటిగట్ల ఎత్తు, లాకుల మరమ్మతులు తదితర అంశాలను విపత్తుల శాఖ నుంచి నిధులు మంజూరు చేయించి ముందుకు వెళదామన్నారు. లక్కవరంలో ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు రెండు ఎకరాల 60 సెంట్ల భూమి ఉందని, ఆ ప్రాంగణంలో ప్రైవేటు భాగస్వామ్యంతో మల్టీస్పెషల్ ఆసుపత్రి ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నట్టు చెప్పారు. అంతర్వేది ఆలయ ప్రాంగణంలో 40 ఎకరాల భూమిలో చుట్టూ కాంపౌండ్‌వాల్ ఏర్పాటుచేసి ఆ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక పర్యాటక రంగంగా తీర్చిదిద్దుదామని, అక్కడ ఒక పక్క కల్యాణ మండపం, త్రీస్టార్ హోటల్ ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నట్టు ఆయన చెప్పారు. సమావేశంలో గుండుబోగుల పెదకాపు, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, తాడి మోహన్, అడబాల యుగంధర్, గుండాబత్తుల తాతాజీ, జంపన సత్యనారాయణరాజు, మల్లిపూడి సత్తిబాబు, పిండి సత్యనారాయణ, చెల్లింగి సత్యనారాయణ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించాలి

అల్లవరం, ఆగస్టు 27: ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని బోడసకుర్రు జనసేన సమావేశం నిర్ణయించింది. జనసేన నాయకులు రోళ్ల శ్రీనివాసరావు, రొక్కాల నాగేశ్వరరావు, నాగేశ్వరరావు, మేకల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్ఎల్ ఆధ్వర్యంలో రెండు మెగా వైద్య శిబిరాలు

అమలాపురం టౌన్, ఆగస్టు 27: జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని నల్లా ఇంద్రాణి మెమోరియల్ సౌజన్యంతో జీఎస్ఎల్ ఆసుపత్రి రాజమహేంద్రవరం వారి సహకారంతో రెండు రోజుల పాటు మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు జనసేన సీనియర్ నాయకుడు నల్లా శ్రీధర్ తెలిపారు. అమలాపురం ముస్లిం షాదీఖానాలో ఈ నెల 31, సెప్టెంబరు 1 తేదీ జరిగే మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో జనసేన నాయకుల ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం పోస్టర్లను ఆవిష్కరించారు. సీనియర్ నాయకులు కంచిపల్లి అబ్బులు, ఇసుకపట్ల రఘుబాబు, నల్లా సంజయ్, యేడిద శ్రీను, కొప్పుల నాగమానస తదితరులు పాల్గొన్నారు.

జనసైనికులచే బస్టాండు నిర్మాణం

మామిడికుదురు, ఆగస్టు 27: మొగలికుదురు గ్రామంలో జనసైనికులు సేకరించిన విరాళాలతో బస్టాండును నిర్మించారు. రూ.2.25లక్షల వ్యయంతో నిర్మించిన బస్టాండ్‌ను బుధవారం అమలాపురం ఎంపీ జి.హరీష్‌మాధుర్, గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణలు ప్రారంభిస్తారని జనసైనికులు తెలిపారు. దీంతో బస్సుల కోసం వేచిచూసే విద్యార్థులు, ప్రయాణికుల కష్టాలు తీరతాయని స్థానికులు పేర్కొంటూ జనసైనికులను అభినందిస్తున్నారు.

'వైద్య సిబ్బందికి రక్షణ కల్పించలేని ప్రభుత్వాలు సిగ్గుపడాలి'

కె.గంగవరం, ఆగస్టు 27: కోల్‌కత్తా ఆర్జీకర్ వైద్యశాలలో జూనియర్ డాక్టర్‌ను అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశ వర్కర్స్ నిరసన తెలిపారు. మెయిన్ రోడ్డులో ర్యాలీ చేసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వైద్య సిబ్బందికి రక్షణకు సమగ్ర చట్టం చేయాలని, అత్యాచార నిందితులను, వారిని రక్షించేవారికి కఠిన కారాగార శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు.

నాడు-నేడు పనులు వేగవంతానికి ప్రత్యేక ప్రణాళిక

ఆలమూరు, ఆగస్టు 27: నాడు-నేడు పనులు వేగవంతం చేయడానికి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నారని రాష్ట్ర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అథారిటీ ఆఫ్ స్కూల్స్ కోఆర్డినేటర్ కె.నాగేశ్వరరావు తెలిపారు. గత ప్రభుత్వం రూ.93 కోట్లు నిధులు పెండింగ్ పెట్టడంతో పనులు మందగించాయని వీటిని క్లియర్ చేయడానికి ప్రభుత్వం ముందుకు రావడంతో పనులు వేగవంతం అవుతున్నట్లు చెప్పారు. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరులో స్కూల్స్‌ను నాగేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కోనసీమ జిల్లాలో 1535 స్కూల్స్‌లో పనులు జరుగుతుండగా దీనిలో 30 శాతం వరకు పనులు పెండింగ్‌లో ఉన్నాయని వీటిని వచ్చే నెల పదినాటికి దాదాపు కొన్ని పనులు పూర్తి చేయడానికి రంగం సిద్ధం చేశామన్నారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన బిల్లులు చెల్లించేందుకు సిద్ధంగా ఉండటంతో పనులు చేయడానికి కాంట్రాక్టర్లు సిద్ధంగా ఉన్నారని నాగేశ్వరరావు చెప్పారు. స్కూల్స్‌లో ఏర్పాటుచేసిన ఆర్‌వో ప్లాంట్లు దాదాపుగా పనిచేయకపోవడానికి కారణం టెక్నీషియన్లు సక్రమంగా పనులు పూర్తి చేయకపోవడమేనని వీటిని తక్షణం పనిచేయించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆలమూరు గరల్స్ హైస్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆలమూరు జూనియర్ కాలేజీ, ఎంపీపీ పాఠశాలలో జరుగుతున్న పనులు, ఆర్వో ప్లాంట్లు, మధ్యాహ్న భోజన పథకం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలమూరు ఎంఈవో పి.సాలెంరాజు, హెచ్ఎం అప్పాజీ, కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం చోరీకి యత్నంపై డీవైఈవో విచారణ

మండపేట, ఆగస్టు 27: మండపేట మండలం ద్వారపూడిలోవున్న జిల్లాపరిషత్ బాలికల హైస్కూల్లో మధ్యాహ్న భోజనం బియ్యం స్వాహకు పాల్పడిన సంఘటనపై రామచంద్రపురం డీవైఈవో నరసింహపణి మంగళవారం సాయంత్రం పాఠశాలలో విచారణ నిర్వహించారు. పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ టీ.మురళీకృష్ణ చేసిన ఫిర్యాదుపై జిల్లా విద్యాధికారి కమలకుమారి ఆదేశాల మేరకు డీవైఈవో విచారణ చేశారు. ఈనెల 25న ఆదివారం పాఠశాలలో ఒప్పందవేతనంపై పనిచేసే డ్రాయింగ్‌టీచర్ పాఠశాలలోకి వచ్చి మధ్యాహ్నభోజనం బియ్యం గది తలుపునుతీసి బియ్యం బయట విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా తాను చూసి ఆదివారం రోజున పాఠశాల తెరవటం ఏమిటని వెళ్లి పరిశీలించగా బియ్యం తరలించే ప్రయత్నాన్ని అడ్డుకున్నానని విద్యాకమిటీ చైర్మన్ మురళీకృష్ణ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే విషయాన్ని ఆయన డీవైఈవోకు లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చారు. ఆదివారం ప్రభుత్వ పాఠశాలలో ఔట్ సోర్సింగ్‌లో పనిచేసే క్రాఫ్ట్‌టీచర్ పాఠశాలను తెరిచి బియ్యం గది తలుపు ఎందుకు తెరిచారన్న అను మానం కలుగుతుంది. హెచ్ఎం ఆదేశాల మేరకు పాఠశాలలో వున్న తరగతి గదుల్లో బ్లాక్‌బోర్డులపై ఇచ్చిన పనిని చేసేందుకు తాను పాఠశాలకు వచ్చానని తాను బియ్యం తరలించేందుకు ప్రయత్నం చేయలేదని డీవైఈవో ముందు క్రాఫ్ట్‌టీచర్ తన వాదనను వెల్లడించారు. డీవైఈవో ఇరువురినీ విచారించి లిఖితపూర్వకంగా ఫిర్యాదును స్వీకరించారు. తాను విచారణ రిపోర్టును డీఈవోకు అందజేస్తానని ఆయన చెప్పారు. డీవైఈవో వెంట ఎంఈవోలు సోమిరెడ్డి, ఎన్.రామచంద్రరావు ఉన్నారు.

సెంట్రల్ కిచెన్ ఆకస్మిక తనిఖీ

యానాం, ఆగస్టు 27: యానాం నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలకు మధ్యాహ్నం ఉచితంగా భోజనం అందించే సెంట్రల్ కిచెన్‌ను యానాం పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 6గంటలకు ఆర్‌ఏ మునిస్వామి స్కూటర్‌పై నేరుగా కమలానెహ్రూ పాఠశాల ఆవరణలో ఉన్న అన్నపూర్ణాలయానికి వెళ్లారు. అక్కడ జరుగుతున్న ఆహారపదార్థాల వంట ప్రక్రియను పరిశీలించారు. సెంట్రల్ కిచెన్ ప్రతినిధి పాము సత్యనారాయణ వాటికి సంబంధించిన అంశాలను వివరించారు. విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలు నాణ్యత లోపించకుండా చూసుకోవాలని, సరైన సమయంలో వాటిని పాఠశాలలకు అందజేయాలని సూచించారు.

1న మండపేటలో కాపు ప్రజాప్రతినిధులకు సత్కారం

మండపేట, ఆగస్టు 27: ఏపీ ఐక్య కాపునాడు ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న రాష్ట్రంలో ఉన్న కాపు ప్రజాప్రతినిధులను మండపేటలో సత్కరించ నున్నామని సంఘ రాష్ట్రాధ్యక్షుడు వాదా ప్రసాదరావు తెలిపారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండపేటలో స్థానికంగా వున్న సూర్య కన్వెన్షన్‌హాలులో పార్టీలకు అతీతంగా కాపు ప్రజాప్రతినిధులను ఒకే తాటిపైకి తీసుకువచ్చి సత్కరిస్తామన్నారు. కాపునాడు రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గాదంశెట్టి కొండలరావు మాట్లాడుతూ మండపేటలో తలపెట్టిన కాపు ప్రజాప్రతి నిధులు సత్కారసభకు కాపు ప్రజాప్రతినిధులుహాజరవుతారన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వానపత్రిక ను కాపునేతలు వాదా ప్రసాదరావు, మాజీ ఎంపీపీదేవు వెంకట్రాజు, రాష్ట్ర నాయకుడు కొండలరావు ఆవిష్కరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల బాలికలు ఎంపిక

రాజోలు, ఆగస్టు 27: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజోలు గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు వ్యాసరచన పోటీల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ టి.లలితకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ వారధి జిల్లాస్థాయి పోటీలు అమలాపురం మండలం వన్నెచింతలపూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం వారధి ఫౌండేషన్‌వారు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మండల, జిల్లాస్థాయిల్లో తొమ్మిదో తరగతి విద్యార్థినులు ఎం.జోయల్‌మేర్సీ, సీహెచ్ వసంతలక్ష్మి, సీహెచ్ సౌభాగ్యలక్ష్మి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. డిబెట్ కాంపిటేషన్‌లో పదో తరగతి విద్యార్థినులు ఎస్.రత్నవల్లీ, జె.స్నేహిత, ఐ.కీర్తన పోటీల్లో రెండో స్థానంలో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విజేతలను ప్రిన్సిపాల్ లలితకుమారి, వైస్ ప్రిన్సిపాల్ వి.అనితకుమారి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, కళాశాల సిబ్బంది అభినందించారు.

ఆంగ్ల వక్తృత్వ పోటీల్లో జిల్లా ఫస్ట్ భీమనపల్లి



ఇంగ్లీషు డిబేటింగ్‌లో జిల్లా ఫస్ట్ సాధించిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

ఉప్పలగుప్తం, ఆగస్టు 27: వారధి ఫౌండేషన్‌జిల్లా స్థాయిలో నిర్వహించిన ఆంగ్ల వక్తృత్వ పోటీల్లో భీమనపల్లి శ్రీమతి శిరంగు రంగనాయకమ్మ జడ్పీ హైస్కూల్ ప్రథమ స్థానం దక్కించుకుంది. శిరంగు శృతి, కుంపట్ల చాతుర్య, ఎస్.అక్షర జిల్లా విజేతలుగా నిలిచి సెప్టెంబరులో జరిగే రాష్ట్ర పోటీలకు అర్హత సాధించారని హెచ్ఎం నూకల సత్యనారాయణ తెలిపారు. ఆంగ్ల వ్యాసరచనలో పాఠశాలకు తృతీయ స్థానం లభించిందన్నారు. విజేతలను, ఆంగ్ల ఉపాధ్యాయులను డీఈవో కమలకుమారి, ఏఎంవో రాంబాబు, ఏపీవో భీమారావు అభినందించారు.

ఘనంగా మదర్‌థెరిస్సా జయంతి

కొత్తపేట, ఆగస్టు27: విజయం చారిటబుల్ ట్రస్టు మండపేట ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలో వానపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మదర్‌థెరిస్సా జయంతిని నిర్వహించారు. ఎంఈవో ఎం.హరిప్రసాద్ మదర్‌థెరిస్సా చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం కొత్తపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు 188 రైటింగ్ ప్యాడ్స్, అలాగే అవిడి ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు 23 రైటింగ్ ప్యాడ్స్, 13 పలకలతో పాటు కొత్తపాలెం, వానపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన కోలా మోహన సత్యసాయి, కోసన భవ్యసావిత్రికి రూ.2వేల నగదు ప్రోత్సాహకాలను అందించారు. కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు అరిగెల శివాజీ, హెచ్ఎంలు కడలి సత్యనారాయణ, ఎ.వెంకటేశ్వరరావు, కె.శివశంకరరావు, బండారు శేషు, ఏ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కొత్తపేట, ఆగస్టు 27: కొత్తపేట మండలం వానపల్లి సంతమార్కెట్ సెంటర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులతోపాటు మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, ఆలయ నిర్మాణ కర్త నేమాని భాస్కరరామం, ఎంపీపీ మార్గాన గంగాధర్, బండారు సత్తిరాజు, ముసునూరి వెంకటేశ్వరరావు, రెడ్డి చంటి పాల్గొన్నారు.

రేపు ఐటీఐ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

అమలాపురం టౌన్, ఆగస్టు 27: 2024-25 సంవత్సరానికి కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మూడో విడత ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ ఎం.వేణుగోపాలవర్మ తెలిపారు. ఈ నెల 29వ తేదీ ఉదయం 8 గంటలకు కాకినాడ పారిశ్రామిక శిక్షణా సంస్థలో ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని, అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

కళాసాహితీ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం

ముమ్మిడివరం, ఆగస్టు 27: ముమ్మిడివరం కళాసాహితీ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని స్థానిక డాక్టర్ ఎంజీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ పుల్లెపు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో గిడుగు రామమూర్తి పంతులు తెలుగు భాషాభివృద్ధికి అందించిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఆధునిక విద్యా విధానంలో తెలుగుభాష అవసరమా అనే విషయంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు రవీంద్ర విద్యాసంస్థల అధినేత పొత్తూరి లక్ష్మీశ్రీనివాస్ బహుమతులు అందజేశారు.

'ఆయిల్‌పామ్ సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలి'



రైతు సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యానందరావు

ఆత్రేయపురం, ఆగస్టు 27: తక్కువ పెట్టుబడితో దీర్ఘకాలంగా ఎక్కువ లాభాలు అందించే ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి పెట్టాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆత్రేయపురం మండలం అంకంపాలెం గ్రామంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. నూనె గింజల ఉత్పత్తికి ఎంతో డిమాండ్ ఉందని తద్వారా 30 ఏళ్ల పాటు రైతులకు ఆదాయం లభిస్తుందని ఈ సాగుపై దృష్టి సారించాలన్నారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, సర్పంచ్ ముత్తాబత్తుల రాజు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు కరుటూరి నరసింహారావు, ముళ్లపూడి భాస్కరరావు, కుదప కృష్ణమూర్తి, ఎడిబుల్స్‌ఆయిల్ జీఎం వీరభద్రరావు, రైతులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి కృషిచేస్తాం'

రావులపాలెం, ఆగస్టు 27: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఆకుల రామకృష్ణ అన్నారు. రావులపాలెంలోని ఇందిరా నగర్‌లోని కమ్యూనిటీ హాలులో జిల్లా అధ్యక్షుడు రావుల సుబ్బారావు అధ్యక్షతన జిల్లా కార్యదర్శి గిడ్ల చిరంజీవి పర్యవేక్షణలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముందుగా ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నుంచి సుమారు 20 మంది సభ్యత్వం స్వీకరించారు. డిపో గౌరవ అధ్యక్షులుగా ఆకుల రామకృష్ణ, అధ్యక్షులుగా లంక శ్రీనివాసరావు, కార్యదర్శిగా గీసాల ప్రసాదరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అడపా లక్ష్మీనాగమల్లి, గరగరావుతో పాటు 15మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా జోనల్ వర్కింగ్ అధ్యక్షుడు కేవీ రావు వ్యవహరించారు. కార్యక్రమంలో వైఎస్ రావు, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి సభ్యత్వాల నమోదు

అల్లవరం, ఆగస్టు 27: గ్రామస్థాయి నుంచి భారతీయ జనతా పార్టీని బలోపేతం చేయడానికి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లాలో ముమ్మరంగా చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ళ దొరబాబు అన్నారు. బోడసకుర్రులో బీజేపీ మండల ప్రముఖ్ అడపా శ్రీనివాసరావు నివాసం వద్ద మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సాయిబాబా అధ్యక్షతన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబరు 1న ప్రధాని మోదీ, 2న రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సభ్యత్వాల నమోదుకు శ్రీకారం చుడతారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకటసుబ్బారావు, రేకాడి వర్మ, ఆకుల వీరబాబు, అరవా చంద్రరావు, కొండేటి ఈశ్వరగౌడ్, ముత్యాల దుర్గారావు, జల్లి రాధాకృష్ణ, ఓలేటి పరమేశ్వరరావు, అరవా చంటి, గణపతిరావు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

బట్టేలంక విద్యార్థులకు బంపర్ ప్రైజ్

మలికిపురం, ఆగస్టు 27: ప్రగతి కలర్ ఉత్సవ్‌లో భాగంగా ప్రగతి పాఠశాల నిర్వహించిన డ్రాయింగ్ పోటీలో బట్టేలంక విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బంపర్ ప్రైజ్‌గా బాలుర సైకిల్‌ను గెలుచుకోవడంతో పాటు 20 బంగారు, 20 రజత పతకాలు, 5 బహుమతులు గెలుచుకుని మొదటి స్థానంలో నిలిచారు. బంపర్ ప్రైజ్‌ను 9వ తరగతి విద్యార్థి వి.రాజేష్ గెలుచుకున్నాడు. ఈ సందర్భంగా డ్రాయింగ్ టీచర్ బి.రాజేంద్రను ప్రధానోపాధ్యాయులు హనుమంతరావును గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ప్రగతి స్కూలు కరస్పాండెంట్ బాలాజీ, మురళీ, సర్పంచ్ బోనం సీతారత్నం, ఎస్ఎంసీ చైర్మన్ ఎల్.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: డిమోంటీ
శ్రీలలిత	: కమిటీ కుర్రోళ్లు
శేఖర్ స్క్రీన్-1	: మారుతీనగర్ సుబ్రహ్మణ్యం
శేఖర్ స్క్రీన్-2	: డబుల్ ఇస్మార్ట్
రమా	: ఆయ్
గణపతి	: రేవు
వెంకటపద్మావతిస్క్రీన్-1	: తంగలాన్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: ఏలియన్ రొమ్యులస్

రుచిలేని మధ్యాహ్న భోజనం

● ప్రధానోపాధ్యాయుడికి ఫిర్యాదుచేసిన విద్యార్థులు

కె.గంగవరం, ఆగస్టు27: మండలంలోని భట్లపాలిక యూపీ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం ఉడకడంలేదని, రుచిగా ఉండటంలేనని విద్యార్థులు వాపోతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఎంసీ చైర్మన్ తిరుమల రావు, ఎంపీటీసీ బాల పాఠశాలకు వెళ్లి విద్యార్థులను ఆరాతీశారు. మధ్యాహ్న భోజనం తీరు గురించి విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. దీనిపై విద్యార్థులతో కలిసి వారు ప్రధానోపాధ్యాయుడికు ఫిర్యాదుచేశారు. మధ్యాహ్న భోజనపథకం నిర్వాహకులను మార్చు చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఎంఈవో ఏ.నాగరాజు వివరణ: భట్లపాలిక యూపీ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం రుచిగాలేదనే విషయంపై ఫిర్యాదు చేసిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. పాఠశాలకు వెళ్లి పరిశీలించి మధ్యాహ్న భోజనం రుచిగా వండే విధంగా నిర్వాహకులకు సూచనలు ఇచ్చి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

లస్కర్ పవన్‌కుమార్‌కు పాముకాటు

అంబాజీపేట, ఆగస్టు 27: ముక్కామల లాకుల పరిధిలో ఔట్‌సోర్సింగ్‌లో లస్కర్‌గా పనిచేస్తున్న దంగేటి పవన్‌కుమార్ మంగళవారం పాముకాటుకు గురయ్యాడు. స్థానిక లాకుల వద్ద పంటకాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్న సమయంలో చెత్తలో ఉన్న పాము పవన్‌ను కాటేసింది. దీంతో పక్కన ఉన్న సూపరింటెండెంట్ మాల్థారేట్, జేఈ నవీన్‌కుమార్, సహఉద్యోగులు స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్య సేవలందించిన అనంతరం అమలాపురం ఏరియా ఆసుపత్రికి మెరుగైన వైద్యం నిమిత్తం తరలించారు.

విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగంపై దృష్టి సారించాలి

అంబాజీపేట, ఆగస్టు 27: విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగంపై దృష్టిసారించాలని హెచ్ఎం కడలి సాయిరామ్ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 6 నుంచి 9వ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు దాతలు సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా కామిశెట్టి సత్యనాగభూషణరావు తల్లిదండ్రులు కామిశెట్టి వీరస్వామినాయుడు- సూర్యాకాంతం ట్రస్టు పేరున ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. దాతలను పీఎంసీ చైర్మన్ పితాని త్రిమూర్తులు, హెచ్ఎం సాయిరామ్‌లు సత్కరించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

ప్రభుత్వ పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు మనూ ప్రకారం భోజనాన్ని ఏర్పాటు చేయాలని ఎంపీడీవో జీవీ సరోవర్ సూచించారు.